## క్లుప్తంగా

### తాటి ముంజెలకు గిరాకీ


భోగాపురం జాతీయ రహదారి పక్కన ముంజెలు విక్రయిస్తున్న వ్యాపారులు

భోగాపురం: వేసవి కాలం వచ్చిందంటే చాలు తాటిముంజెలకు ఎనలేని గిరాకీ ఉంటుంది. వాటిని తినడం వల్ల శరీరం చల్లబడుతుంది. అంతేకాకుండా లేత ముంజెలు తినడం వల్ల తొందరగా జీర్ణమవుతాయి. మండలంలో సుమారు 60 కుటుంబాలకు పైగా తాటి ముంజెల వ్యాపారం సాగిస్తున్నారు. తాటి చెట్ల నుంచి తాటికాయాలను కోసి వాటి నుంచి ముంజెలు తీసి డజను రూ.40లు చొప్పున విక్రయిస్తున్నారు. జాతీయ రహదారిపై నాతవలస టోల్ ప్లాజా వద్ద, తగరపువలస, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నామని వ్యాపారులు చెబుతున్నారు. ముంజెలు విక్రయం ద్వారా రోజుకు రూ.300 నుంచి రూ.400 ఆదాయం ఉంటుందని అంటున్నారు.

### నేడు కౌన్సిల్ సమావేశం

విజయనగరం: విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ అత్యవసర సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ కమిషనర్ పీవీడీ ప్రసాదరావు తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి కౌన్సిల్ సభ్యులతో పాటు వివిధ విభాగాల అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు.

### చిన్నారులకు పెన్నులు, పుస్తకాల పంపిణీ


పుస్తకాలు, పెన్నులు అందుకున్న చిన్నారులు

విజయనగరం టౌన్: స్థానిక గురజాడ కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతులకు విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. ఇప్పటివరకు 46 మంది విద్యార్థులు సంగీతంలో శిక్షణ తీసుకున్నారని గ్రంథాలయ సంస్థ ప్రతినిధి భాష మంగళవారం తెలిపారు. తమ్మిన షణ్ముఖ ప్రియ విద్యార్థులకు సంగీతంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

### డీఎస్పీ ఆకస్మిక తనిఖీ


స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ ఆర్.గోవిందరావు

విజయనగరం క్రైమ్: స్థానిక రూరల్ పోలీసు స్టేషన్‌ను డీఎస్పీ ఆర్.గోవిందరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, కేసుల వివరాలను, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా నడచుకోవాలని సూచించారు. కేసులకు సంబంధించిన నివేదికలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే క్రమశిక్షణా చర్యలు ఉంటాయన్నారు. బాధితులకు సత్వర న్యాయం అందించాలని సూచించారు. రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట రూరల్ సీఐ టీవీ తిరుపతిరావు, ఎస్సై గణేష్, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

### అనాథలను ఆదుకోవడంలోనే సంతృప్తి



ఆశ్రమానికి రిఫ్రిజిరేటర్ అందజేస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య సతీమణి దేవీఅనురాధ

బొండపల్లి:

అనాథలను ఆదుకోవడంలోనే నిజమైన సంతృప్తి ఉంటుందని స్థానిక ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. ఈనెల 24 ఎమ్మెల్యే అప్పలనర సయ్య వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని ఒంపల్లిలోని అనాథ ఆశ్రమానికి రూ.50 వేల విలువైన రిఫ్రిజిరేటర్, ఆశ్రమంలోని 135 మంది పిల్లలకు పౌష్టికాహారం సమకూర్చారు. వీటిని ఎమ్మెల్యే భార్య బొత్స దేవీఅనురాధ ఆశ్రమానికి మంగళవారం అందజేశారు. పిల్లలతో ఆమె కాసేపు ముచ్చటించారు. పిల్లలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని ఆమె చెప్పారు.

# వలంటీర్ల సేవలు ఆదర్శం


సీహెచ్ అగ్రహారంలో వలంటీర్లను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పూసపాటిరేగ: వలంటీర్లు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఎంపీపీ మహంతి కల్యాణి అన్నారు. మండలంలోని సీహెచ్ అగ్రహారం, కనిమెల్ల, కందివలస గ్రామ సచివాలయాల పరిధిలో సేవలందిస్తున్న వలంటీర్లను మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పాలనను ప్రజలకు చేరువ చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారని, వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎన్.సత్యనారాయణరాజు, ఎంపీడీఓ జి.రామారావు, సర్పంచ్ కొత్తకోట శ్రీరాములు, ప్రజాప్రతినిధి మహంతి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

**కొండగుంపాంలో..**

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండగుంపాం గ్రామంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వైస్ ఎంపీపీ పతివాడ సత్యనారాయణ, సర్పంచ్ పతివాడ అప్పన్న ఆధ్వర్యంలో సచివాలయ పరిధిలో పనిచేస్తున్న 21 మంది వలంటీర్లను ఘనంగా సన్మానించి, ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజలకు సకాలంలో సేవలు అందుతున్నాయన్నారు. కార్యాలయాలకు వెళ్లకుండానే ఇంటి వద్దనే పనులు జరుగుతున్నాయని చెప్పారు. వలంటీర్లు చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

**గ్రామ వలంటీర్ల పాత్ర కీలకం**

విజయనగరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలులో గ్రామ వలంటీర్ల పాత్ర కీలకమని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. మండలంలోని చెల్లూరు గ్రామంలో చెల్లూరు, సుంకరిపేట, బియ్యాలపేట గ్రామ వలంటీర్లకు ప్రభుత్వం అందిస్తున్న సేవా పురస్కారాల ప్రదానోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పేద ప్రజల సంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని, వాటిని ప్రజలకు చేరువ చేయడంలో వలంటీర్ల పాత్ర కీలకమని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయసాధనకు కృషి చేస్తున్న గ్రామ వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. అనంతరం వలంటీర్లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ నడిపేన శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


నెల్లిమర్ల రూరల్: వలంటీర్లను సన్మానిస్తున్న వైస్ ఎంపీపీ పతివాడ సత్యన్నారాయణ, తదితరులు


విజయనగరం రూరల్: గ్రామ వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ, తదితరులు

## ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి

- ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు రామచంద్రరావు


శిబిరంలో మాట్లాడుతున్న రామచంద్రరావు

నెల్లిమర్ల: ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పి.రామచంద్రరావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నెల్లిమర్ల తాలూకా యూనిట్‌కు చెందిన ఉద్యోగులు మంగళవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. శిబిరంలో పాల్గొన్న రామచంద్రరావు మాట్లాడుతూ ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దుచేసి, వెంటనే ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. 1993 నవంబరు 25వ తేదీకి ముందు నియమితులైన ఎన్ఎంఆర్, డైలీవేజ్, కంటింజెంట్ ఉద్యోగులను తక్షణమే రెగ్యులర్ చేయాలన్నారు. అన్ని శాఖల్లో డీఎస్సీ ద్వారా నియమితులైన కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేసి, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మెరుగైన జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ఈ నెల 31 వరకు ప్రతి రోజూ ఒక్కో తాలూకా యూనిట్ ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి యుగంధర్, జిల్లా కోశాధికారి వై.శంకరరావు, తాలూకా యూనిట్ అధ్యక్షుడు పి.వీరన్నదొర, ఎంపీడీఓ జి.గిరిబాల తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

- నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి


చెరుకురసం పంపిణీ చేస్తున్న కోలగట్ల శ్రావణి, తదితరులు

విజయనగరం: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా చల్లని మజ్జిగ, చెరుకు రసం పంపిణీ చేయడం అభినందనీయమని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. నగరంలోని రాజారావు మేడ సమీపంలో కస్పా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఉచితంగా చెరుకు రసం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సంఘం తరఫున భవిష్యత్‌లో ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టేవారికి కోలగట్ల కుటుంబం ఎప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. సుమారు రూ.50 వేలు వెచ్చించి ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉచితంగా ప్రజలకు చెరుకు రసం పంపిణీ చేస్తున్నామని సంఘం అధ్యక్షుడు వెత్స శ్రీనివాసరావు, కార్యదర్శి ముత్యాల నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో సంఘ కోశాధికారి కోలగట్ల కామేష్, పలివెల శ్రీనివాసరావు, కాపుగంటి రమేష్, ముత్యాల శ్రీనివాసరావు, అక్షింతల సతీష్, కాపుగంటి రామకృష్ణ, గ్రంధి సూరి, ఎం. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు గుడ్లు పంపిణీ


తైక్వాండో క్రీడాకారులకు గుడ్లు పంపిణీ చేస్తున్న స్థానిక ప్రజాప్రతినిధులు

విజయనగరం: శాప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి క్రీడా శిక్షణా శిబిరాల్లో భాగంగా స్థానికంగా మదర్ థెరిసా క్లబ్‌లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు పలువురు దాతలు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. పీసీఎస్ మాజీ అధ్యక్షుడు మజ్జి అప్పలరావు, కార్పొరేటర్ వింత ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పిన్నింటి సూర్యనారాయణ చేతుల మీదుగా మంగళవారం క్రీడాకారులకు గుడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వింత ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ నేటి సమాజంలో పిల్లలకు చదువుతో పాటు క్రీడలు ముఖ్యమని, ఉచిత వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శిక్షకులు సీహెచ్ వేణుగోపాలరావు, మాజీ కౌన్సిలర్ ముద్దాడ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారుల ఖాతాల్లో ఆసరా నిధులు జమ


సీఎం లేఖ, వైఎస్సార్ ఆసరా స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ వాసుదేవరావు, తదితరులు

డెంకాడ: వైఎస్సార్ ఆసరా డబ్బులు ఆయా పొదుపు సంఘాల మహిళల బ్యాంకు ఖాతాల్లో జమ అయిందని తెలియజేస్తూ లబ్ధిదారుల బయోమెట్రిక్ ధ్రువీకరణను వైకేపీ సిబ్బంది తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అక్కచెల్లెమ్మలకు రాసిన లేఖతో పాటు వైఎస్సార్ ఆసరా స్టిక్కర్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు ఏపీఎం విజయలక్ష్మి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు చేతుల మీదుగా సీఎం లేఖతో పాటు స్టిక్కర్లను ఆవిష్కరించారు. ఎంపీడీఓ స్వరూపారాణి, సీసీలు, ఈఓపీఆర్డీ అప్పలనాయుడు పాల్గొన్నారు.

## వైఎస్సార్ సంపూర్ణ పోషణ గర్భిణులకు వరం


బాలింతలకు పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న శివారెడ్డి

భోగాపురం: గర్భిణులు, బాలింతల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ అభియాన్ పథకం ద్వారా పౌష్టికాహారం అందిస్తోందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్, అమటాం రావివలస సర్పంచ్ ఉప్పాడ శివారెడ్డి అన్నారు. పంచాయతీ పరిధి దల్లిపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంతిలతతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే రుచికరమైన పౌష్టికాహార కిట్ తీసుకోవడం ద్వారా గర్భిణులు, బాలింతలకు రక్తహీనత సమస్య ఉండదన్నారు. పుష్టికరమైన భోజనంతో తల్లీపిల్లలకు ఆరోగ్య సమస్యలు తలెత్తవని చెప్పారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ స్వర్ణ, సచివాలయ మహిళ పోలీస్ రీనాపాల్, వైఎస్సార్‌సీపీ నాయకులు దల్లి సూరి, లక్ష్మి, నరసింగరావు, సోమిరెడ్డి, బంగారి, బోర నాగరాజు, రమేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### నిమిషం ఆలస్యమైనా అనుమతించం

డెంకాడ: ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలకు నిమిషం ఆలస్యమైనా అనుమతించమని చీఫ్ సూపరింటెండెంట్ పి.శిరీష్, డిపార్ట్‌మెంట్ అధికారి వై.త్రినాథరావు తెలిపారు. డెంకాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 24 నుంచి 30 వరకు సప్లమెంటరీ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు మొదటి సంవత్సరం విద్యార్థులకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ఉంటాయన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించేది లేదని స్పష్టం చేశారు

### నాడు- నేడు పనుల పరిశీలన

వేపాడ: మనబడి నాడు-నేడు పథకం రెండో విడతలో భాగంగా నీలకంఠరాజపురం ఉన్నత పాఠశాలలో చేపడుతున్న అభివృద్ధి పనులను ఎంపీడీఓ ఎన్.ఎస్.కె.పట్నాయక్, ఎంఈఓ శ్రీదేవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దేవి మంగళవారం పరిశీలించారు. నిర్మాణ పనుల ను,తరగతి గదుల్లో విద్యుత్ వైరింగ్, రన్నింగ్ వాటర్ సదుపాయం, ఫర్నీచర్ ఏర్పాటును పరిశీలించి, హెచ్ఎం కృష్ణారావుకు పలు సూచనలు చేశారు.

## భూ సర్వే వేగవంతం చేయాలి

- మున్సిపల్ ఆర్డీ నాగరాజు


సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీ నాగరాజు

నెల్లిమర్ల: నగర పంచాయతీలో చేపడుతున్న జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం సర్వేను వేగవంతం చేయాలని మున్సిపల్ ఆర్డీ జి.నాగరాజు ఆదేశించారు. నెల్లిమర్ల నగరపంచాయతీ పరిధిలో చేపడుతున్న భూముల సర్వేను మంగళవారం ఆయన పరిశీలించారు. డ్రోన్ సర్వే ఎంతవరకు వచ్చిందని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పట్టణవాసుల సహకారంతో ఎటువంటి అవాంతరాలు జరగకుండా త్వరితగతిన సర్వే పూర్తి చేయాలన్నారు. అనంతరం పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఏఈలను అడిగి తెలుసుకున్నారు. అందుబాటులో ఉన్న నిధులతో పనులు చురుగ్గా జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. పారిశుద్య నిర్వహణ, తాగునీటి సరఫరాపై సమీక్షించారు. ప్రస్తుత వేసవిలో తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కమిషనర్ బాలాజీ ప్రసాద్‌కు ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మేరా లైఫ్-మేరా స్వచ్ఛ సెహర్ కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని సూచించారు.

## మరో 30 ఏళ్లు జగనే సీఎం


కేకు కట్ చేస్తున్న ఎంపీపీ చలం నాయుడు, జెడ్పీటీసీ సూర్యప్రకాశరావు

బొండపల్లి: రాష్ట్రంలో మరో 30 సంవత్సరాల పాటు ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగనున్నారని, అందులో ఎలాంటి సందేహం లేదని ఎంపీపీ చల్లా చలంనాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు అన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మండలంలోని దేవుపల్లి గ్రామంలో మంగళవారం సంబరాలు నిర్వహించారు. ఎంపీపీ, జెడ్పీటీసీ కేకు కట్ చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు రాపాక వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇట్లా తిరుపతిరావు, రాపాక మనోజ్ కార్యకర్తలు, గృహసారథులు, తదితరులు పాల్గొన్నారు.

## నిర్వాసిత కాలనీల్లో పెండింగ్ పనులు పూర్తిచేయండి

- కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం ఫోర్ట్: భోగాపురం విమానాశ్రయ నిర్వాసిత కాలనీల్లో ఇంకా ఏమైనా పనులు మిగిలి ఉంటే త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. ఆమె ఛాంబర్‌లో మంగళవారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ముందుగా గూడెపువలస, పోలిపల్లి కాలనీల్లో అన్ని రకాల పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. జూన్ నెలాఖరులోగా పనులు పూర్తిచేసి నివేదిక అందజేయాలన్నారు. కాలనీ ముఖద్వారం, ప్రహరీ, పిల్లల పార్కు, ఇతర మౌలిక వసతులు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో పలు సాగునీటి ప్రాజెక్టులు, జాతీయ రహదారుల ప్రాజెక్టు, రైల్వే ప్రాజెక్టుల భూసేకరణలో ఎదురవుతున్న సమస్యలపై సమీక్షించారు. సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ తాజా పరిస్థితిపై కార్యనిర్వాహణ ఇంజినీర్‌లు వివరించారు. తారకరామ తీర్థసాగర్‌కు ఇంకా 188 ఎకరాలు సేకరించాల్సి ఉందని ఈఈ తిరుపతిరావు తెలిపారు. తోటపల్లి ప్రాజెక్టుకు లస్కర్ లేకపోవడం వల్ల సాగునీటి విడుదల సమయంలో సమస్యలు వస్తున్నట్లు ఈఈ రామచంద్రరావు కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ ఆశోక్, ఆర్డీఓ సూర్యకళ తదితరులు పాల్గొన్నారు.


## వైద్యాధికారుల తీరుపై అసహనం

- 104 ద్వారా ఏయే సేవలందిస్తారో తెలియకపోతే ఎలా..?
- మండల సమావేశంలో వైద్యాధికారులపై జెడ్పీ ఛైర్మన్ ఆగ్రహం
- ఫోన్‌లో డీఎంఅండ్‌హెచ్‌ఓకు ఫిర్యాదు


వైద్యాధికారులపై డీఎంఅండ్‌హెచ్‌ఒకు ఫోన్‌లో ఫిర్యాదుచేస్తున్న జెడ్పీచైర్మన్ శ్రీనివాసరావు

మెరకముడిదాం: 104 ద్వారా రోగులకు ఏయే వైద్యపరీక్షలు చేస్తారో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల(పీహెచ్‌సీల) వైద్యాధికారులకే తెలియకపోతే ఎలా అని జిల్లా పరిషత్ చైర్మ న్ మజ్జి శ్రీనివాసరావు మెరకముడిదాం, గర్భాం పీహెచ్‌సీల వైద్యాధికారులు అజిత్‌బాబు, అజయ్‌కుమార్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాల యంలో ఎంపీపీ తాడ్డి కృష్ణవేణి అధ్యక్షతన మండల సర్వసభ్యసమావేశం మంగళవారం నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ శాఖల వారీగా సమీక్షించారు. మెరకముడిదాం, గర్భాం పీహెచ్‌సీల వైద్యాధికారులు తమ శాఖకు చెందిన వివరాలను వెల్లడిస్తుండగా.. గ్రామాల్లో 104 వాహనం ద్వారా గ్రామాల్లో ప్రజలకు ఏయే వైద్యపరీక్షలు చేస్తుంటా రని జెడ్పీ చైర్మన్ వైద్యాధికారులను ప్రశ్నించారు. దీనికి వైద్యాధికారులు సరిగా సమాధానం చెప్పలేకపోవడంతో వారి తీరుపై చైర్మన్ అసహనం వ్యక్తం చేశారు. వెంటనే జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి (డీఎంఅండ్‌హెచ్‌ఓ)తో చైర్మన్ ఫోన్‌లో వైద్యాధికారులపై ఫిర్యాదు చేశారు. 104 ద్వారా ఏయే వైద్యపరీక్షలు చేస్తారో వైద్యులకే తెలియకపోతే, రోగులకు ఏం సేవలు అందిస్తారని, 104 సేవలపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించి, తర్వాత గ్రామాల్లో కరపత్రాల ద్వారా ప్రచారం చేయించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓకు సూచించారు. మన బడి నాడు-నేడు పనులపై ఎంఈఓ రామారావు, అర్‌డబ్ల్యూఎస్ ఏఈ పార్వతికి జెడ్పీ చైర్మన్ పలు సూచనలు చేశారు.మండలంలో నాడు-నేడుకు ఎంపికైన పాఠశాలల్లో అభివృద్ధి పనులకు సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తయారుచేసిన ఎస్టిమేట్ల ఆధారంగా క్షేత్రస్థాయిలో పాఠశాలల్లో చేపట్టాల్సిన పనులను గుర్తించాలని ఆదేశించారు. పనులకు ఇంజినీరింగ్ అధికారులు వేసిన నిధుల అంచనా సరిపోతుందో లేదో పరిశీలించాలని, దీనిపై మళ్లీ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హెచ్‌ఎంలు, ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి సమీక్ష నిర్వహించుకోవాలని చెప్పారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు వరి విత్తనాలు, ఎరువులకు ఇబ్బందులు తలెత్తకూడదని, సకాలంలో రైతులకు విత్తనాలు,ఎరువులు పంపిణీ చేయాలని ఏఓ శ్రావణితేజను చైర్మన్ ఆదేశించారు. జిల్లాపరిషత్ డిప్యూటీ సీఈఓ రాజ్‌కుమార్, డీపీఓ శ్రీధర్‌రాజా, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, నాయకులు కోట్ల విశ్వేశ్వరరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం


గుర్ల: వైఎస్సార్ ఆసరా స్టిక్కర్లను లబ్ధిదారుల ఇళ్లకు అతికిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, నాయకులు

- జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసరావు

గుర్ల: మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నారని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీని వాసరావు అన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా డ్వాక్రా సంఘాల సభ్యులకు 2019 ఎన్నికల నాటికి ఉన్న రుణాలను నాలుగు విడతల్లో మాఫీ చేస్తామని జగన్ మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. చెప్పిన మాట ప్రకారం ప్రభుత్వం ఇప్పటివరకు మూడు విడతలకు సంబంధించిన నగదు ను డ్వాక్రా సంఘాల సభ్యుల ఖాతాల్లో జమచేసింది. ఈ సందర్భంగా వెలుగు సిబ్బంది లబ్ధిదారుల బయోమెట్రిక్ నమోదు చేపడుతుండగా.. ప్రజాప్రతినిధులు, నాయకులు వారి ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం చేసిన మేలును వివరిస్తూ, ఆసరా పథకం స్టిక్కర్లను ఇంటింటికీ అతికిస్తున్నారు. అందులో భాగంగానే మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమాన్ని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు పరిశీలించారు. ప్రజాప్రతిని ధులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఆసరా పథకం లబ్దిదారులతో ఆయన మాట్లాడారు. పథకం ద్వారా లబ్ధిచేకూరిందా లేదా అని ఆరా తీసి, సీఎం జగన్ సందేశంతో కూడిన కరపత్రాలను అందజేశారు. అనంతరం ఆసరా స్టిక్కర్లను ఇళ్లకు అతకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసరా పథకం కింద మండలంలోని 1,254 డ్వాక్రా సంఘాల సభ్యుల ఖాతాల్లో మూడో విడతగా రూ.8.6 కోట్లను ప్రభుత్వం జమ చేసిందని చెప్పారు. మహిళలకు అన్ని విధాలుగా అండగా ఉంటున్న సీఎం జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణ రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు. ఎంపీడీఓ కల్యాణి, తహసీల్దార్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### ప్రకటన

యాక్సిస్ బ్యాంక్, SME, VNP శాఖ, విశాఖపట్నం వారి సూచనల మేరకు మేము దిగువ తెలిపిన ప్రకటనను జారీ చేస్తున్నాము.

సేల్ డీడ్స్ 2130/2017, 2127/2017, 2792/2015, 6817/2021 [illegible]

సేల్ డీడ్ 2130/2017కు [illegible] సేల్ డీడ్స్ 2127/2017 మరియు 6817/2021 [illegible] సేల్ డీడ్ 2792/2015కు [illegible]

[illegible] 7 రోజులలోగా దిగువ తెలిపిన చిరునామాకు గానీ లేదా ఫోన్ సంబర్లకు గానీ [illegible]

**సేల్ డీడ్ 2130/2017కి కవర్ చేయబడిన షెడ్యూలు ఆస్తి**

విజయనగరం జిల్లా, భోగాపురం మండలం, గుడివాడ గ్రామంలోని సర్వే నం. 59/[illegible] కవర్ చేయబడిన ఎ. 0.[illegible] లేదా [illegible] చదరపు గజాల విస్తీర్ణం గల భూమి యావత్తు.

**సేల్ డీడ్ నెం. 2127/2017 కి కవర్ చేయబడిన షెడ్యూలు ఆస్తి**

విజయనగరం జిల్లా, భోగాపురం మండలం, గుడివాడ గ్రామంలోని సర్వే నెం. 59/8A కి కవర్ చేయబడిన ఎ. 0.07 లేదా 338.8 చదరపు గజాల విస్తీర్ణం గల భూమి యావత్తు.

**సేల్ డీడ్ నెం. 2792/2015కి కవర్ చేయబడిన షెడ్యూలు ఆస్తి**

విజయనగరం జిల్లా, భోగాపురం మండలం గుడివాడ గ్రామంలోని S.No. 59/9 (0.05½), S.No. 59/11 (0.26) మరియు S.No. 59/14 (0.20)కి కవర్ చేయబడిన ఎ. 0.51½ విస్తీర్ణం గల భూమి యావత్తు.

**సేల్ డీడ్ నెం. 6817/2021కి కవర్ చేయబడిన షెడ్యూల్ ఆస్తి**

విజయనగరం జిల్లా, భోగాపురం మండలం, గుడివాడ గ్రామంలోని S.No. 59/11 (0.13), S.No. 59/14 (0.10) మరియు S.No. 59/[illegible] (0.0[illegible]) కి కవర్ చేయబడిన ఎ. 0.26½ విస్తీర్ణం గల భూమి యావత్తు.

D.నాగేశ్వరరావు, అడ్వకేట్
ఫ్లాట్ నం A-1308, [illegible]
సీతమ్మధార, విశాఖపట్నం
9676300007 & 9703430509